క్లుప్తంగా

ఉత్కంఠగా ఆటల పోటీలు



మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎస్జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు ఉత్కంఠ వాతావరణంలో సాగాయి. రెండో రోజైన బుధవారం షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు అండర్-14, అండర్-17 విభాగాల సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలకు మండల స్పోర్ట్స్ ఇన్చార్జి కె.చందు, పీడీలు రామారావు, నాగశివ, బసవయ్య, మనోహరి తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.12 వేలు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం అన్నసమారాధనకు భక్తులు రూ.12 వేలు అందజేసినట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు. ఆలయ కార్యాలయంలో బుధవారం పట్టణానికి చెందిన భక్తులు కేఎస్‌డీ జయరామ్ దంపతులు ఈ వితరణ అందజేసినట్లు ఆయన తెలిపారు.

అన్నసమారాధన వాయిదా

ఆలయంలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఈ నెల 29వ తేదీన భారీ అన్నసమారాధన నిర్వహించాలని పాలకవర్గం నిర్ణయించింది. వాతావరణం అనుకూలించని కారణంగా అక్టోబర్ ఆరో తేదీకి అన్నసమారాధన కార్యక్రమం వాయిదా వేశారు.

కళామతల్లికి ఎస్పీ బాలు చేసిన సేవలు నిరుపమానం



పామర్రు: పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళామతల్లికి చేసిన సేవలు నిరుపమానమని పామర్రు ఘంటసాల ఎస్పీ బాలు కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో ఎస్పీ బాలు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ బాలు చేసిన సేవలను నేటి తరం యువ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యురాలు బొప్పన స్వర్ణలత, హితమ్ స్కూల్ ఉపాధ్యాయులు, కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



జమీగొల్వేపల్లి(పామర్రు): నేషనల్ ఖో-ఖో చాంపియన్ షిప్ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం టి.ఉషారాణి తెలిపారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రామంలో జెడ్పీ హైస్కూల్లో విజేత అయిన విద్యార్థినిని బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జార్ఖండ్‌లోని సిండిగాలో ఉన్న ఆల్‌బర్ట్ ఎక్కా స్టేడియంలో జరిగే 34వ సబ్ జూనియర్ ఖో-ఖో పోటీలకు మా పాఠశాలలోని ఏడో తరగతి చదువుతున్న కొల్లూరి రేష్మశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రవిబాబును హెచ్ఎం, కృష్ణా జిల్లా ఖో-ఖో సంఘ అధ్యక్షుడు మడకా ప్రసాద్, ఆంధ్ర ఖో-ఖో సంఘ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డుపై గుంతతో అవస్థలు



మండవల్లి: మండవల్లిలో మల్లేశ్వరస్వామి ఆలయం వెనుక ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంత వల్ల ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. సుమారు అడుగు లోతులో ఉన్న గుంతలో వర్షం నీరు నిలిచిన సమయంలో వాహనదారులు, పాదాచారులకు గుంత కన్పించక అవస్థలు పడుతున్నారు. గుంతలో దిగిన వాహనం పైకి రావడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి ప్రజలు మూడుతాళ్లపాడు, ఇంగిలిపాకలంక తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై గుంతను పూడ్చించాలని పలువురు కోరుతున్నారు.

ఫార్మాసిస్టులు ఆరోగ్యప్రదాతలు



గుడ్లవల్లేరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామమూర్తి

గుడ్లవల్లేరు: ఫార్మాసిస్టులు ఆరోగ్య ప్రదాతలు అని గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) గుడ్లవల్లేరు శాఖ వారు బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు శ్రమ పడితే గాని ఒక ఔషధాన్ని రూపొందించగలమన్నారు. ఆ ఔషధాన్ని రోగికి చేరువగా తీసుకురావడంలో ఫార్మాసిస్ట్ పాత్ర ఎంతో ఉంటుందన్నారు. విద్యార్థులంతా అన్ని సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలను అవపాసన పట్టాలన్నారు. వైవిధ్యంగా ఆలోచించి నూతన ఔషధాలు, మెడికల్ పరికరాలు, వినూత్న పరిశోధనలను చేయాలని సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఐపీఏ గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష, సెక్రటరీ ఎ.సాయిధాత్రి, మెంబర్ ఎస్‌కే నాగూర్ మీరావతి, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, టి.శ్రావణి, వీఎల్ వినోద్‌కుమార్, డాక్టర్ వి.రజని పాల్గొన్నారు.

ఔషధ నిపుణుల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు: వైద్యులకు సహాయకులుగా ఉంటున్న ఔషధ నిపుణుల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వరల్డ్ ఫార్మసిస్టు డే (ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవాన్ని) బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్కర కరోనా పరిస్థితుల నుంచి మనల్ని కాపాడుకున్నామంటే దీనికి ఫార్మసిస్టులే ప్రధాన కారణమన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫార్మసిస్టు సంస్థ వలనే కరోనా సమయంలో మందులను ఇతర ప్రాంతాలకు సరఫరా చేశారని పేర్కొన్నారు. ఫార్మసిస్టు కారిడార్‌ను ఏర్పాటు చేసిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. అనంతరం ఫార్మసిస్టులను సన్మానించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఏపీ ఫార్మసిస్టు అసోసియేషన్ చైర్మన్ లుక్కా నరేష్, రవికుమార్, రాజశేఖర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో ఫార్మసిస్టులను సన్మానించి సర్టిఫికెట్లను అందజేసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో మెప్మా, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అవసరమన్నారు. దీనిపై తల్లులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించేందుకు వివిధ ఆహార పదార్థాలు, వాటి ఉపయోగాలు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు



పొలం పిలుస్తోందిరా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: గుడివాడ మండలంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని బిళ్లపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తొలుత పొలం పిలుస్తోందిరా అనే కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, తెలుగు యువత అధ్యక్షుడు కర్రే వెంకటగిరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకుడు దావులూరి సురేంద్ర, ఎంపీడీఓ వెంకటరమణ, గ్రామ ప్రత్యేకాధికారి బోలెం అనంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



గుడివాడ టౌన్: సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ నాయకులు అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని విరిధి ఫంక్షన్ హాల్లో దీన్‌దయాళ్ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మొర

వెంట్రప్రగడ(పెదపారుపూడి): అంతర్గత రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీళ్లలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని స్థానిక పాటిమీద ఉన్న ముస్లిం మహిళలు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజాకు మొర పెట్టుకున్నారు. మండలంలోని వెంట్రప్రగడలోని కల్యాణ మండపంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలకు మోపర్రు, వింజరంపాడు గ్రామాలకు చాలా వరకు దెబ్బతిన్నటంతో అన్ని రకాలగా ఆదుకున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ సీతామహాలక్ష్మీ, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నాయకులు ఆంజనేయులు, సుబ్బయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గుడ్లవల్లేరు: ప్రజా సమస్యలను పరిష్కరించటంలో రెవెన్యూ మండల సర్వేయర్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ కృషి చేశారని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గుడివాడకు రాజశేఖర్, పామర్రుకు బదిలీ అవుతున్న రామకృష్ణను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ షకీలాబేగం, వీఆర్వోలు శాయన ప్రకాష్, పురిటిపాటి రవి, సనకా భాస్కరరావు, మల్లికార్జునరావు, రామ్మూర్తి, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

వరిసాగులో చీడపీడల నివారణ కీలకం



చౌటపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి



కూచిపూడి నిర్వహించిన పొలంబడిలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు, రైతులు



మండవల్లి మండలం పెరికెగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

గుడివాడరూరల్: వరి పైరును ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి రైతులకు సూచించారు. మండలంలోని చౌటపల్లి, బిళ్లపాడు గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బుధవారం ఏడీఏ ప్రసంగించారు. వరిసాగులో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పైరును కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే ప్రమాదం ఉందని ముందస్తుగానే రైతులు జాగ్రత్తలు తీసుకుని పైరును కాపాడుకోవాలని సూచించారు. మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులతో పంటను పాడుచేసుకోవద్దని కోరారు. సీనియర్ శాస్త్రవేత్త(ఎస్ఆర్ఎస్) విజయభాస్కరరెడ్డి, వెటర్నరీ డాక్టర్ వి.హనుమంతరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి

కూచిపూడి(మొవ్వ): ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీలను రైతులు ఈ నెలాఖరులోపు తప్పని సరిగా చేయించుకోవాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల సూచించారు. మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కే లహరి పాల్గొని మాట్లాడారు. నత్రజని ఎరువుని మోతాదుకు మించి వాడరాదన్నారు. దీని ప్రభావంతో పురుగుల ఉధృతి పెరుగుతుందని సూచించారు. అలాగే వ్యవసాయ పరిశోధన స్థానం ఘంటసాల నందు రబీసాగుకు అవసరమైన ఎల్‌బీజీ-932, ఎల్‌బీజీ-904, జీబీజీ-1 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, ఏఓ శివప్రసాద్, ఈఓ భవానీ, వీఏఏ కుమార సోమేశ్వర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ముదినేపల్లి రూరల్: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి వేణుమాధవ్ అన్నారు. మండలంలోని దాకరం, పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు.పశువైద్యులు క్రాంతికుమార్, దాకరం సర్పంచ జాస్తీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని అన్ని పీఏసీఎస్‌లలో యూరియా, పొటాష్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మర్రివాడ, గోపువానిపాలెం గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాసరావు రైతులతో కలిసి వరిపొలాలలను సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. గోపువానిపాలెంలో రైతులు ఎరువుల కొరత ఉందని చెప్పగా, పీఏసీఎస్ గోడౌన్‌ను తనిఖీ చేసి ఇండెంట్ పెట్టించారు. కార్యక్రమంలో ఏఓ గణేష్‌రెడ్డి, ఉద్యాన అధికారి నాగదేవిశ్రీ పాల్గొన్నారు.



మర్రివాడలో వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా రైతులకు అందజేసే కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఫీల్డ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా రైతులకు వేప, ఇంగువ ద్రావణం తయారీ, ద్రవజీవామృతం తయారీని ప్రదర్శించారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా పాల్గొన్నారు.

జీవామృతం తయారీపైఅవగాహన

కురుమద్దాలి(పామర్రు): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రతిఒక్కరూ ద్రవ జీవామృతం తయారీ గురించి తెలుసుకుని దిగుబడులు పెంపొందించుకోవాలని పామర్రు ఏఓ శివనాగరాణి పేర్కొన్నారు. మండలంలోని కురుమద్దాలి, కనుమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

అంతరిక్షంపై విద్యార్థులకు అవగాహన అవసరం



సభలో మాట్లాడుతున్న మిద్దె శ్రీనివాసరావు

గుడ్లవల్లేరు: అంతరిక్ష పరిశోధనల్లోని శాస్త్ర, సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన అవసరమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మిద్దె శ్రీనివాసరరావు అన్నారు. గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో ఇస్రో, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఆర్‌జీ ఇంజినీరింగ్ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. స్థానిక హైస్కూల్‌తో పాటు ఎస్ఈఆర్ఎం హైస్కూల్‌కు చెందిన 6-10వ తరగతి విద్యార్థులు 380 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని శాటిలైట్, వాటి ఉపయోగాలు పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ గురించి అవగాహన పెంచుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, వైస్ ప్రిన్సిపాల్ జీఎం సత్యబాబు పాల్గొన్నారు.

వీఆర్వోల బదిలీ

గుడివాడరూరల్: మండలంలో పలువురు వీఆర్వోలు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీఆర్వోలను అధికారులు బదిలీ చేశారు. దొండపాడు వీఆర్వో కె.అనిల్‌కుమార్ శేరీగొల్వేపల్లికి, బొమ్ములూరు వీఆర్వో ఎ.సుధారాణి బిళ్లపాడు వీఆర్వోగా, కృత్తివెన్ను మండలం చినపాండ్రక గ్రామ వీఆర్వో బి.సాల్మన్‌రాజు మోటూరుకు, మచిలీపట్నం మండలం కానూరు గ్రామ వీఆర్వో డొక్కుమాల ప్రసాద్ మల్లాయపాలెం-2 వీఆర్వోగా, గుడివాడ పట్టణం సత్యనారాయణపురం వీఆర్వో జి.చలపతిరావు లింవవరం వీఆర్వోగా, బేతవోలు-2 వీఆర్వో జి.లక్ష్మణరావు మల్లాయపాలెం-1 వీఆర్వోగా, మల్లాయపాలెం-2 వీవిఆర్వో కె.నాంచారయ్య గుడివాడ పట్టణం పెదఎరుకపాడుకు, లింగవరం వీఆర్వో కె.సుబ్బారావు దొండపాడుకు, గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు-2 వీఆర్వో ఎల్.శ్రీనివాసరావు చౌటపల్లికి, శేరీగొల్వేపల్లి వీఆర్వో ఎం.లక్ష్మేశ్వరరావు నాగవరప్పాడు-2 వీఆర్వోగా, దనియాలపేట వీఆర్వో పి.ప్రకాష బాబు బేతవోలు-1 వీఆర్వోగా, కల్వపూడి అగ్రహారం వీఆర్వో ఆర్.శివశేఖర్ రామనపూడికి, బిళ్లపాడు వీఆర్వో మరియాంబి బొమ్ములూరుకు, గుడ్లవల్లేరు మండలం వేమవరం వీఆర్వో ఆర్.శ్రీరామ్మూర్తి కల్వపూడి అగ్రహారం వీఆర్వోగా, పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ-1 వీఆర్వో ఎస్ఎన్‌సి వెంకట్ బేతవోలు-2 వీఆర్వోగాలుగా బదిలీలపై వచ్చారు. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

డిజిటల్ అసిస్టెంట్లు, గ్రేడ్-5 సెక్రటరీల బదిలీ

గుడివాడరూరల్: సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, గ్రేడ్-5 సెక్రటరీలు బుధవారం బదిలీ అయ్యారు.

లింగవరం డిజిటల్ అసిస్టెంట్ ఎ.లోకేష్ వలివర్తిపాడుకు, మల్లాయపాలెం-1 డిజిటల్ అసిస్టెంట్ ఎం.మదుబాల తోట్లవల్లూరు మండలం బొద్దపాడు గ్రామానికి, రామనపూడి డిజిటల్ అసిస్టెంట్ సీహెచ్ నాగేంద్రబాబు గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు-2 సచివాలయానికి, వలివర్తిపాడు డిజిటల్ అసిస్టెంట్ వి.లక్ష్మణరావు లింగవరం సచివాలయానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా గ్రేడ్-5 సెక్రటరీలు పర్నాస గ్రామ సెక్రటరీ పి.శాంతదేవి మల్లాయపాలెం-2 సచివాలయానికి, శేరీదింటకుర్రు గ్రేడ్-5 సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం పర్నాస గ్రామానికి, శేరీవేల్పూరు గ్రేడ్-5సెక్రటరీ ఎం.దేవి చరణ్ శేరీదింటకుర్రు గ్రామానికి, తటివర్రు గ్రామ గ్రేడ్-5 సెక్రటరీ జి.చందురాహుల్ నందివాడ మండలం పెదలింగాల గ్రామానికి బదిలీ అయ్యారు.

సంక్షిప్త వార్తలు

■ సీఎంకు రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

పామర్రు: పామర్రు మండలంలోని పలు ప్రైవేట్ స్కూల్స్ అధినేతలు సీఎం చంద్రబాబుకు ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌ను బుధవారం అందజేశారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డి, విద్యార్థులు కలిసి రూ.1,55,558, జుఝువరంలోని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ, విద్యార్థులు కలిసి రూ.2,87,786 చెక్కులను సీఎంకు అందజేశారు. అప్సా డెమొక్రటి చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు పాల్గొన్నారు.

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పేర్ని రవికుమార్ తెలిపారు. మండలంలోని చిగురుకోట, కొత్తపల్లి, సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ కైకలూరులో..

కైకలూరు: చిగురుకోట 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం నియోజకవర్గంలో పలు మండల సబ్‌స్టేసన్ల పరిధి గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ పి.రామకృష్ణ బుధవారం తెలిపారు. కలిదిండి మండలంలో కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, కాళ్లపాలెం, కైకలూరు మండలం వరహాపట్నం, ముదినేపల్లి మండలం చిగురుకోట, కొత్తపల్లి, సింగరాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

■ బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

గుడివాడ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న బైపాస్ రోడ్డుకు మరమ్మతుపనులను బుధవారం ప్రారంభించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేరకు ఈ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం భారీగా ఏర్పడిన గోతులు పూడ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పూర్తిగా నిర్మాణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు.

■ దోమల నివారణ మందు పిచికారీ

మండవల్లి: కొవ్వాడలంకలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ఎస్ శ్రీనివాసరావు బుధవారం దోమలమందు పిచికారీ చేయించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి పాత్రలపై మూతలు తప్పనిసరిగా పెట్టాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ చంద్రమోహన్, భాస్కర్ పాల్గొన్నారు.

■ చిన్నారులకు కంటి పరీక్షలు

గుడివాడ టౌన్: చిన్నారులకు మెరుగైన కనుదృష్టి ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని డిస్ట్రిక్ ఎడ్యుకేషన కో-ఆర్డినేటర్ రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్లో సర్వశిక్ష, ఎల్‌బీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ సొసైటీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో లోపాలను గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీ ప్రసాద్ ఆస్పత్రి బృందం సభ్యులు సునందిని, శృతి, చంద్రమన్న, ప్రకాష్, చందు, జాషువా, నాగజ్యోతి పాల్గొన్నారు.

■ వ్యాయామోపాధ్యాయులతో సమావేశం

ముదినేపల్లి రూరల్: మండలస్థాయి అండర్-14, అండర్-17 బాలురు, బాలికల క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక శుక్ర, శనివారాల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరుగుతాయని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ తెలిపారు. బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా వంటి అంశాల్లో ఎంపిక జరుగుతుందని తెలిపారు.

■ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో ఎయిడ్స్ నియంత్రణపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో క్లస్టర్ లింక్‌వర్కర్ సీహెచ్ నాగలక్ష్మి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాప్తి చెందే కారణాల గురించి వివరించారు. గ్రామంలోని మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.విశాలక్ష్మి, జగదీశ్వరీ, ఝాన్సీరాణి, కొండాలమ్మ, పాల్గొన్నారు.

■ గరుడా సేవలు అభినందనీయం

ఎలకుర్రు(పామర్రు): ప్రముఖ వ్యాపార సంస్థ గరుడ కెమికల్స్‌కు వచ్చిన లాభాలను సామాజిక సేవకు వినియోగించడం అభినందనీయమని కేడీబీ ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలో ఉన్న కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టులోని ప్రత్యేక అవసరాలు గల మానసిక దివ్యాంగుల డే కేర్ సెంటర్‌లోని చిన్నారులకు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్) పరికరాలు, పండ్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమికల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేహెచ్ గరుడ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. గరుడ సీనియర్ మేనేజర్ ఎస్.వెంకటపతి పాల్గొన్నారు.

■ కొనకళ్లను అభినందించిన ఎమ్మెల్యే

పామర్రు: మచిలీపట్నం మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును ప్రభుత్వం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా బుధవారం నారాయణరావును కలిసి అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

■ వైభవంగా సీతారాముల కల్యాణం

కలిదిండి (కైకలూరు): శ్రీరామ.. జయజయ రామ అనే నామస్మరణతో పడమటిపాలెం గ్రామం బుధవారం మార్మోగింది. గ్రామంలో రామభక్తులు 45 రోజుల దీక్షను పూర్తి చేసుకుని సీతారామలక్ష్మణ సమేత అంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ సానా మీనాసరస్వతి, రాము దంపతులు స్వామివారి కల్యాణం జరిపించిన గోల్కొండ వెంకన్న దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించారు.